క్లుప్తంగా

మెడికల్ కిట్లు పంపిణీ

జరుగుమల్లి(సింగరాయకొండ): స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ మాట్లాడుతూ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు అందజేశారు. ఏపీఓ నాగరాజు, టీఏలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పొన్నలూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం జెడ్పీ పాఠశాల్లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. మోనూ తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయగా అంగన్‌వాడీ కార్యకర్త విధులకు హాజరు కాకపోవడంతో విచారించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

లింగసముద్రం: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అవుల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి బుధవారం మధ్యాహ్నం ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రెండు ట్రాక్టర్లు పట్టివేత

కనిగిరి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం సెబ్ అధికారులు పట్టుకున్నారు. సెబ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సెబ్ అధికారులు స్థానిక పామూరు రోడ్డులో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను, సుమారు 8 టన్నుల ఇసుక సీజ్ చేసి, ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

హనుమంతునిపాడు: రెవెన్యూ పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీ పరిశీలించి సమస్యలే కుండా పనిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సూచించారు. వీఆర్వోలు, సుబ్బయ్య, షేక్ కాశీమ్ పీరా, పురుషోతం, బాదుర్ల, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

గుడ్లూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ సకాలంలో సచివాలయాలకు రావాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని అమ్మవారిపాలెం సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, రిజిష్టర్లు, బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివిధ రకాల సర్టిఫికెట్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా అందించాలన్నారు. అనంతరం అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు ఉన్నారు.

సైన్స్ ప్రదర్శనలో అరివేముల విద్యార్థుల ప్రతిభ

సీఎస్‌పురం: జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో మండలంలోని అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితాప్రియ తెలిపారు. ఒంగోలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి సైన్స్ పదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు యశ్వంత్, తేజలు సైన్స్ ఉపాధ్యాయురాలు జె. సుప్రజ ఆధ్వర్యంలో పవన విద్యుత్‌ను తెలిపే ప్రాజెక్టును ప్రదర్శించారు.

కొనుగోళ్లకు వేళాయే..!

- రేపటి నుంచి కొండపిలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- 9.89 మిలియన్ కేజీల పొగాకు అమ్మకానికి అనుమతి
- ధరలపైనే రైతుల గంపెడాశ



కొండపి పొగాకు వేలంకేంద్రం

కొండపి: కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తామని వేలంకేంద్రం అధికారి ఎస్ రామారావు తెలిపారు. రైతులకు 2023 పంట కాలానికి సంబంధించి ఈ సంవత్సరం పొగాకు బోర్డు 9.89 మిలియన్ కేజీల అమ్మకాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తేలిక నేలల్లో సాగు చేసిన బ్యారన్‌కి 36.50 క్వింటాళ్లు, నల్లరేగడి భూముల్లో సాగు చేసిన బ్యారన్‌కి 35.50 క్వింటాళ్లు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 2,764 పొగాకు బ్యారన్‌లకు చెందిన 45 గ్రామాల్లోని 3950 మంది రైతులు తమ పొగాకును ఈ ఏడాది కొండపి పొగాకు వేలంకేంద్రంలో అమ్ముకోవడానికి అవకాశం ఉంది. పొగాకు బోర్డు రైతులకు ఇచ్చిన 6,400 హెక్టార్ల సాగుకు మించి రైతులు ఎక్కువగా సాగు చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన పొగాకును బయట మార్కెట్‌లో ఎట్టి పరిస్థితుల్లో అమ్ముకోవద్దని తెలిపారు. అనుమతి ఉన్న రైతులు తమ చివరి కేజీ వరకు పొగాకు బోర్డులోనే అమ్ముకోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో పొగాకు అమ్ముకోవటం వలన రైతులకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా పొగాకు బయట అమ్మినా..కొన్నా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే అక్రమ కొనుగోలుదారులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలిరోజు జువ్విగుంట క్లస్టర్‌తో ఉదయం 10.50 గంటలకు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమౌతాయని తెలిపారు. తొలిరౌండ్ అమ్మకాలకు సంబంధించి బ్యారన్‌కి 4 బేళ్ల అనుమతి ఇస్తున్నట్లు వేలంకేంద్రం అధికారి తెలిపారు. రైతులు పొగాకు సగటు ధర కేజీ రూ.200 దక్కేలా చూడాలని బోర్డు అధికారులను, వ్యాపారులను కోరుతున్నారు.

గృహ సారథులు పార్టీకి రథ సారథులు

వలేటివారిపాలెం: సచివాలయ గృహ సారథులుగా నియమితులైన వారంతా భవిష్యత్‌లో పార్టీకి రథసారథులుగా పార్టీ విజయానికి కృషి చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ అనుమోలు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొండసముద్రం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బుధవారం అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు రాకుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వచ్చేలా చూడాలన్నారు. సర్పంచ్ మన్నం వెంగమ్మ ,ఉపసర్పంచ్ నరసింగరావు, మన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వివరించాలని సచివాలయ కన్వీనర్ల కో ఆర్డినేటర్ వరికూటి క్రిష్టారెడ్డి అన్నారు. మండలంలోని యర్రారెడ్డిపాలెం సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహనా కల్పించారు. గృహ సారథులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, నాయకులు వెన్నపూస కొండారెడ్డి, బత్తిన మధు తదితరులు పాల్గొన్నారు.



సాలిపేటలో మాట్లాడుతున్న నాయకులు

గుడ్లూరు: మండలంలోని సాలిపేట, రావూరు, కొత్తపేట గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బుధవారం అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ సచివాలయ జేసీఎస్ కన్వీనర్ గాజుల కిషోర్, ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్శిపాటి బాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ ప్రచార కిట్లను అందచేశారు. మీడియా అధికార ప్రతినిధి జిల్లా రమణయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, సర్పంచ్‌లు చాపల రమణయ్య, కొనికి గంగయ్య, సుబ్బరామయ్య, వెంకట కిష్టయ్య,రామ్మూర్తి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనుల అడ్డగింత



నిర్మాణపనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోటలో నిర్మాణంలో ఉన్న 132 కెవీ సబ్‌స్టేషన్ పనులను బుధవారం మన్నేటికోట గ్రామస్తులు అడ్డుకున్నారు. నాలుగేళ్లుగా పనులు ప్రారంభించిన ప్రతిసారీ అడ్డుకుంటున్నారు. సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పలుమార్లు గ్రామసభలు నిర్వహించారు. అయినా సయోధ్య కుదరలేదు. బయట నుంచి లైన్లు లాగడం దాదాపు 70 శాతం పూర్తయింది. కేవలం సబ్‌స్టేషన్ నిర్మాణం మాత్రమే జరగాలి. ఈ పరిస్థితుల్లో విద్యుత్ శాఖ నిర్మాణ పనులు జరిగేలా కోర్టు ఆర్డర్ తీసుకుని పోలీస్ శాఖ సహకారంతో పనులు ప్రారంభించడానికి బుధవారం జేసీబీతో గుంతలు తీయడం ప్రారంభించారు. గ్రామస్తులు పనులు చేయడానికి ఒప్పుకోమని జేసీబీకి అడ్డంగా కూర్చున్నారు. కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసులు, కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకటరావు, సుబ్బారావు, తహసీల్దార్ మహ్మద్ హుసేన్‌లు గ్రామస్తులకు నచ్చచెప్పాలని ప్రయత్నించినా వారు ఒప్పుకోలేదు. ఈ స్థలంలో కాకుండా వేరే స్థలంలో నిర్మించాలని కోరగా స్థలం మార్చడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. అటు అధికారులు, ఇటు గ్రామస్తులు నిర్మాణ స్థలంలోనే కూర్చుని ఉన్నారు. పనులు నిలిచిపోయాయి. పోలీసులు నిర్మాణ స్థలంలో వివాదాలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అబుల్‌కలాం ఆజాద్ కృషి ఎనలేనిది



అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పామూరు: దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ కృషి ఎనలేనిదని ముస్లిం సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అన్నారు. స్థానిక ముస్లిం సంక్షేమ సంఘ కార్యాలయంలో బుధవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 65వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రషీద్, పామూరు మండల అధ్యక్షుడు షేక్.సలీం, గౌరవ అధ్యక్షుడు షేక్.ఖాజీ ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి షేక్.జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రహీం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో కీలకమైన పాత్ర పోషించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచానిని చాటిన మహనీయుడు ఆజాద్ అని కొనియాడారు.

- మంత్రిగా పనిచేసి విద్యా రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.
- మాజీ ఏఎంసీ డైరక్టర్ కామాక్షి నాయుడు, ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు కరీముల్లా, ముజకీర్, నయీమ్‌బాష, సుల్తాన్ పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ ఏర్పాట్ల పరిశీలన



సూరారెడ్డిపాలెంలో ఔట్‌లెట్లను పరిశీలిస్తున్న ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, అధికారులు

టంగుటూరు: జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆదేశాల మేరకు మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామ సమీపంలోని ఐఓసీఎల్, బీపీసీఎల్ అవుట్‌లెట్‌లలో ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను గురువారం నిర్వహించనున్నారు. ఐఓసీఎల్, బీపీసీఎల్ పరిధిలోని మాక్‌డ్రిల్‌కు అవసరమైన ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాలను బుధవారం ఏఆర్ డీఎస్పీ టి.నాగేశ్వరరావు పరిశీలించారు. ఆయిల్ డంపు వంటి సున్నితమైన ప్రాంతాల్లో పరిశీలించి పలు వివరాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఆయిల్ డంప్ సమయంలో ప్రమాదం సంభవిస్తే అత్యవసరంగా నిర్ణయాలు, అవుట్‌లెట్‌లలో అదుపులోకి రాని మంటల కారణంగా అవసరమైతే చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఇతర ప్రాంతాలకు ఏ విధంగా తరలించాలనే అంశంపై మాక్‌డ్రిల్ ఉంటుందన్నారు. దీనిపై సిబ్బందికి అవగాహన సదస్సు ఉంటుందని ఏఆర్ డీఎస్పీ టి. నాగేశ్వరరావు తెలిపారు. సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా, ఐఓసీ మేనేజర్ రాజు, టోల్‌ప్లాజా పీఆర్వో నరసింహరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్యాబోధన లభిస్తోందని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని గురువాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, పాఠశాల వార్షికోత్సవ సభ హెచ్‌ఎం తన్నీరు హరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు అందుతున్నాయన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కాంక్షించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన దిశగా ముందడుగు వేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సర్పంచ్ కుమ్మరికుంట సౌందరయ్య, ఎంపీటీసీ రెక్కల విజయలక్ష్మీ, వైస్ సర్పంచ్ చాగంరెడ్డి రాజమోహన్‌రెడ్డి, దాత నాదెళ్ల తిరుపతిరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆదినారాయణమ్మ, వైఎస్సార్ సీపీ రైతు అధ్యక్షుడు సిద్దారెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత నాదేళ్ల తిరుపతయ్య పరీక్షా సామగ్రిని అందచేశారు. హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కళాశాలకు బీరువాలు,ఏసీలు అందచేస్తున్న పూర్వవిద్యార్థులు

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల త్వరలో న్యాక్ అక్రిడిటేషన్‌కు వెళుతున్న సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు రూ 1.75 లక్షల విలువైన 6 స్టీలు బీరువాలు, 2 ఏసీలను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రిటైర్డు హెడ్ మాస్టర్ విప్పగుంట మల్లికార్జున రావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. న్యాక్ సాధన కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు మృతిపై విచారణ

వలేటివారిపాలెం: మండలంలోని పోలినేనిపాలెం గ్రామానికి చెందిన బూదాల సుబ్బారావు అనే రైతు ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ సమయంలో మండల స్థాయి అధికారులు రైతు మృతికి కారణాలు విశ్లేషిస్తూ ఉన్నత అధికారులను నివేదికలు పంపారు. ఆ మేరకు డివిజన్ స్థాయి కమిటీ విచారణలో భాగంగా కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక బుధవారం పోలినేనిపాలెం వచ్చారు. మృతి పై స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నత అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులైన వ్యవసాయ శాఖ ఏడీ శేషగిరిరావు, డీఎస్పీ కండే శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, ఏఓ హేమంత్ భరత్‌కుమార్, ఆర్ఐ నరసయ్య, వీఆర్‌ఓ అంజలి పాల్గొన్నారు.

తవనం చెంచయ్య జీవితం ఆదర్శం

సీఎస్‌పురం: నిస్వార్థ రాజకీయ జీవితానికి నిలువెత్తు నిదర్శనం తవనం చెంచయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం తవనం చెంచయ్య 9వ వర్ధంతిని నిర్వహించారు. చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్ తిరుపతిరెడ్డి, ఆర్ కరిముల్లా, ఊసా రాజ్యలక్ష్మి, బి.దేవదానం, విజయ్ పాల్గొన్నారు.

పామూరు: తవనం చెంచయ్య వర్ధంతిని స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. నాయకులు షేక్.మీరావళి, షేక్.అల్లాబక్షు, షేక్.ఖాసీంసాహెబ్, మహబూపీరా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులు



ఉయ్యాలవాడ నరశింహారెడ్డికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

కందుకూరు రూరల్: డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయంలోని ఉద్యానవన కళాశాలలో స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయపద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలన్నారు. ప్రొఫెసర్ విజయ్‌భాస్కర్ నరసింహారెడ్డి జీవిత కథను వివరించారు. విద్యార్థి వ్యవహారాల అధికారి శిరీషా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత

సీఎస్‌పురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాజకీయ పరంగానే కాక, అన్ని రంగాల్లో బీసీ, ముస్లిం మైనార్టీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి అన్నారు. మండలంలోని కోవిలంపాడులో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా అధిక ప్రాధాన్యత సంతరించుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ముస్లిం మైనారిటీలను ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారని, తాజాగా ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో బీసీలకు 11 స్థానాలు కేటాయించడంతో పాటు అన్ని కులాల వారికి రాజకీయంగా తగిన గుర్తింపునిచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.


పుణ్యక్షేత్రాల దర్శనార్థం ప్రత్యేక బస్సులు

కందుకూరు అర్బన్: కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి వచ్చే నెల 6వ తేదీ పౌర్ణమి సందర్భంగా పుణ్యక్షేత్రాల దర్శనార్థం ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు మేనేజర్ పెద్దన్నశెట్టి తెలిపారు. అరుణాచలం గిరి ప్రదర్శన, చిదంబరం, వైద్దేశ్వరం, స్వామిమలై, కుంభకోణం, తంజావూరు, రామేశ్వరం, ధనుష్కోటి, మధురై, శ్రీరంగం, జంబుకేశ్వరం, అరుణాచలం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం తదితర పుణ్యక్షేత్రాల దర్శనార్థం నడుపుతున్నామన్నారు. డిపో నుంచి 3వ తేదీ 7 గంటలకు బయలుదేరి పౌర్ణమి రోజు నాటికి అరుణాచలం బస్సు చేరుకుంటుందని తెలియజేశారు. పూర్తి వివరాలకు 7382889870 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వల్లూరమ్మ దేవస్థానానికి జనరేటర్ బహూకరణ

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ దేవస్థానానికి రూ. 5 లక్షల విలువైన జనరేటర్‌ను పల్లవి గ్రానైట్స్ కడవలూరి సుబ్బారెడ్డి, శైలజ బుధవారం అందించారు. ఆలయ అర్చకులు దాతల చేతుల మీదగా జనరేటర్‌ను ప్రారంభించి పూజలు చేశారు. ఆలయ ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్,సిబ్బందిపాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి కోటేశ్వరి

ఉలవపాడు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయ రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న గ్రంథాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

సీఎస్‌పురం: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదును సర్పంచ్ సూరిపోగు రాజమ్మ, ఆంతోని బుధవారం అందజేశారు. మండలంలోని నల్లమడుగుల ఎస్టీ కాలనీకి చెందిన రాగి సైమన్ (40) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పథకంలో చేరి ఉండటంతో మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి జి.మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అడవి పేరంటాళమ్మ తిరునాళ్ల

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, నేరేడుపల్లి అడవి పేరంటాళమ్మ తిరునాళ్ల బుధవారంతో ముగిసింది. చివరి రోజు సందర్భంగా పేరంటాళమ్మకు పొంగళ్లు, కుంకుమపూజలు చేశారు. మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గిట్టుబాటు కూలి వచ్చేలా పనులు చేయాలి

సీఎస్‌పురం: గిట్టుబాటు కూలి వచ్చేలా కూలీలు పనులు చేయాలని ఏపీఓ సుబ్బారావు అన్నారు. మండలంలోని చెర్లోపల్లిలో ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలు సమయపాలన పాటించి గిట్టుబాటు కూలి వచ్చేలా పనులు చేయాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్లు సకాలంలో కొలతలు తీసి అప్‌లోడ్ చేయాలని, ఫీల్డ్ నుంచి పనులను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

110 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దగొల్లపల్లి పంచాయతీ పరిధి కుడుమలకుంటలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం

హనుమంతునిపాడు: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పిద్దామని ఎస్‌బీసీసీ సెల్ జిల్లా కో ఆర్డినేట్ కిరణ్ కుమార్ అన్నారు. సామాజిక పరివర్తన్ మార్పుపై ఏర్పాటైన జిల్లా కమిటీ సభ్యులు బుధవారం విద్యావనరుల కేంద్రంలో, కస్తూరిబా బాలికల పాఠశాలలో, సచివాలయ పరిధి ఏఎన్‌ఎంలకు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సమావేశం నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిబాట పట్టించాలన్నారు. మండలంలో బాల కార్మికులను, వెట్టి చాకిరి చేస్తున్న వారిని గుర్తించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ జి .పెద్దిరాజు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, వైఎస్సార్ పోషణ కిట్లపై అవగాహనకల్పించారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎదురయ్యే నష్టాలపై అవగాహన కల్పించారు. గుడ్‌హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, కేజీబీ ఎస్‌ఓ సుశీల, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని పెంచండి

జరుగుమల్లి(సింగరాయకొండ): సచివాలయాల్లో లభించే సేవల ద్వారా ఆదాయాన్ని పెంచాలని, ఇందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామకృష్ణ గ్రామ సచివాలయ అధికారులకు సూచించారు. జరుగుమల్లి మండలంలోని పాలేటిపాడు, తూమాడు గ్రామ సచివాలయాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు పరిశీలించారు. నూరుశాతం హాజరు ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఎరువును తయారీ చేసి అమ్మడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చాలని సూచించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు తప్పనిసరిగా సచివాలయాల్లో ఉండాలని, స్పందనలో పాల్గొనాలని వివరించారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు రజనీ, మౌనిక పాల్గొన్నారు.